# సాక్షి

## అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 25 । జనవరి । 2025






**నీలగిరి చెట్లు నరికివేత?** IIలో

బస్కీ పంచాయతీ అటవీ ప్రాంతంలోని నీలగిరి చెట్లను నరికి తరలించుకుపోతున్నారని పంచాయతీ వాసులు ఆరోపించారు.



**బాలికా సంరక్షణకు కృషి** IIలో

బాలికా సంరక్షణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు.



**జనరేటర్లకు వెంటనే మరమ్మతులు**

పాడైన జనరేటర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సజయ్‌కుమార్ ఆదేశించారు. IIలో

## న్యూస్‌రీల్

### గణతంత్ర వేడుకలకు పాలమామిడి సర్పంచ్

- కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం



సర్పంచ్ రామకృష్ణ

జి.మాడుగుల: న్యూఢిల్లీలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు మండలంలోని పాలమామిడి సర్పంచ్ సురభంగి రామకృష్ణకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. జలజీవన్ మిషన్ పథకాల అమలు, నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించినందుకుగాను అయనకు అరుదైన అవకాశం లభించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

### రేషన్ డీలర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: ఏజెన్సీల ఖాళీగా ఉన్న 34 రేషన్ షాప్‌లకు డీలర్లను కమిటీ ద్వారా ఎంపిక చేసి నియమించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీలర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 34 రేషన్ డీలర్ల షాపులకు 308 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 305 మంది రాత పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఎటువంటి అవకతవలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం డీలర్లను నియమిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ డీఈవో వై మల్లేశ్వరరావు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, సీడీపీవో సంధ్యారాణి, ఎంఈవో ఎం.రామకృష్ణ, ఏఎస్‌వో విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### మన్యం కొండ జాతర ఏర్పాట్ల పరిశీలన



సీలేరు నది ఒడ్డున ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో, ఒడిశా అధికారులు

మోతుగూడెం: మన్యం కొండ జాతరకు సంబంధించిన ఏర్పాట్లను చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్, ఒడిశా రాష్ట్రం కలిమిల అసిస్టెంట్ బ్లాక్ డవలప్‌మెంట్ అధికారి భసంత్ కుమార్ బెహరా శుక్రవారం పరిశీలించారు. మార్చి4న జరగనున్న ఈ జాతరకు సంబంధించి పొల్లూరు వాటర్ పాల్స్, వనదేవతలను దాటించే సీలేరు నది ఒడ్డును వారు పరిశీలించారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి ఈ జాతరకు ఒడిశా, తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 50వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం చింతూరు పీవో, ఒడిశా అధికారులు జాతర ఏర్పాట్లపై చర్చించారు. ఒడిశా ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో బోట్లు, ఫ్లూటింగ్ బ్రిడ్జిని తాత్కలికంగా ఏర్పాటు చేస్తామని పీవోకు ఒడిశా అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో మల్కనగిరి, కలిమెల తహసీల్దార్లు , మోతుగూడెం ఎస్‌ఐ శివన్నారాయణ, చింతూరు తహసీల్దార్ శ్యామ్, కార్యదర్శి మోహన్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల ఎంపికకు 30న రాతపరీక్ష

- ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు: స్థానిక డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డిపోలకు డీలర్ల నియామకానికి సంబంధించి ఈనెల 30న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్లో ఖాళీగా ఉన్న రేషన్ షాపుల డీలర్ల నియామకానికి 274 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరిశీలన అనంతరం వీటిలో 195 ఆమోదించామన్నారు. రాత పరీక్షకు సంబంధించి ఈనెల 25 నుంచి 29 వరకు సంబంధిత మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో హాల్ టికెట్లు పొందవచ్చని అయన పేర్కొన్నారు. అభ్యర్థులకు ఈనెల 30న చింతూరు గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుంచి 11.30 వరకు 80 మార్కులకు రాతపరీక్ష ఉంటుందన్నారు. కనీసం 30 మార్కులతో అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించాలని పీవో తెలిపారు. వీరికి ఈనెల 31న ఉదయం 10 గంటల నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

# మత్స్యగెడ్డ గుండెల్లో గునపాలు

## ఇసుక వనరులను కొల్లగొడుతున్న అక్రమార్కులు



చాపరాయి గెడ్డలో ఇసుక అక్రమ తవ్వకాలు



చాపరాయి గెడ్డ వద్ద పొక్లెయిన్‌తో ఇసుక లోడింగ్

మన్యంలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా ఉండే గెడ్డల్లోని ఇసుకనే గిరిజనులు తమ అవసరాల కోసం వినియోగించుకోవాల్సిన పరిస్థితి. దీనిని ఆసరాగా తీసుకుని అధికార కూటమి నేతలు మాఫియాగా ఏర్పడి గెడ్డల్లోని ఇసుకను దర్జాగా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇసుక డిపోను ఏర్పాటు చేయాలనే నిబంధన మన్యంలో అమలుకాలేదు. అధికారిక ఇసుక రీచ్‌లు, డిపోలు లేకపోవడంతో పాడేరు, హుకుంపేట, పెదబయలు, అనంతగిరి మండలాల్లోని మత్స్యగెడ్డ, గోస్తనీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ క్వారీలు కొనసాగిస్తున్నారు. వీరిలో కొంతమంది అధికార్టీ నేతలు కావడంతో అధికారులు మౌనం వహిస్తున్నారు.

- పరీవాహక ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు
- నాలుగు ప్రాంతాల నుంచి విచ్చలవిడిగా తరలింపు
- ప్రతిరోజూ రూ.లక్షల్లో వ్యాపారం
- వాగులనూ వదలని అక్రమార్కులు
- కొంతమంది కూటమి నేతలు కీలకపాత్ర
- అధికారపార్టీకి చెందిన వారు కావడంతో చోద్యం చూస్తున్న అధికారులు



హుకుంపేట మండలం కామయ్యపేట శివారు మత్స్యగెడ్డలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని మత్స్యగెడ్డ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి రోజూ రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాల మీదుగా జోలాపుట్టు జలాశయం వరకు మత్స్యగెడ్డ విస్తరించి ఉంది.

### ఇసుక తరలింపును నియంత్రిస్తాం



ఏజెన్సీలోని గెడ్డలు, వాగులలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను నియంత్రిస్తాం. అభివృద్ధి పనులు, గిరిజనుల ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే అనుమతులు మేరకు ఇసుక సేకరించవచ్చు. ప్రధాన గెడ్డల్లో ఇసుక తవ్వకాలు, రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. దీనిపై రెవెన్యూ అధికారులతో సమీక్ష అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

- హుకుంపేట మండలం కామయ్యపేట ప్రాంతంలోని మత్స్యగెడ్డ వద్ద నాలుగు అక్రమ ఇసుక క్వారీలు వెలిశాయి. పగలు,రాత్రి తేడా లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. వ్యాన్లలో రోజుకు సుమారు వంద ట్రిప్పుల ఇసుక తరలిపోతోంది. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నప్పటికీ రెవెన్యూ యంత్రాంగం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టన్ను ఇసుక రూ.2వేల నుంచి రూ.3వేలకు అమ్ముతూ కాసులు ఆర్జిస్తున్నారు.
- హుకుంపేట మండలంలోని దిగుడుపుట్టు గెడ్డ వద్ద ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. డుంబ్రిగుడ మండలంలో చాపరాయిగెడ్డ, కురిడిగెడ్డ పరివాహక ప్రాంతాలలోను ఇసుక అక్రమ వ్యాపారం భారీగా జరుగుతోంది. అధికార టీడీపీ నేతల వాహనాలతోనే ఇసుక భారీగా తరలిపోతోందని ప్రచారం జరుగుతోంది. ఇదంతా బహిరంగమైనా అధికార యంత్రాంగం తనిఖీలు జరిపిన దాఖలాలు లేవు.
- అనంతగిరి మండలంలోని గోస్తనీ నది పరివాహక ప్రాంతంలోను కూడా నిత్యం ఇసుక భారీగా తరలిపోతోంది. గెడ్డలు, వాగుల్లోని ఇసుకను బహిరంగంగా దర్జాగా తరలిస్తున్నారు.
- జిల్లాలోని చింతూరు డివిజన్ ఎటపాక మండలంలోని గుండాలలో మాత్రమే ఇసుక డిపోలు ఉన్నాయి. మిగిలిన 21 మండలాల్లో ఎక్కడ ఇసుక రీచ్‌లు, డిపోలు అందుబాటులో లేవు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూ ప్రచారం చేసినప్పటికీ గిరిజన ప్రాంతాల్లో మాత్రం ఈ విధానం అమలు కాలేదు. దీంతో వ్యాన్లు, ట్రాక్టర్లు, లారీల ఆపరేటర్లు వాగులు, గెడ్డల్లో ఇసుక తవ్వకాలను పోత్సహిస్తున్నారు. పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ మండలాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది.

### సరళ్ కార్యక్రమంలో శిక్షణ, ఉపాధి

- ఎస్పీ అమిత్‌బర్దర్



మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

పాడేరు : గతంలో మావోయిస్టు పార్టీలో పనిచేసి లొంగిపోయిన మావోయిస్టులు, మిలీషియా సభ్యులతో పాటు వారి పిల్లలకు సరళ్ కార్యక్రమం ద్వారా నచ్చిన రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. గతంలో దళంలో పనిచేస్తూ పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టులు, మిలీషియా సభ్యులకు చెందిన 42 మంది విద్యార్థులకు శుక్రవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రశాంతి ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ అధ్యాపకులతో వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి కెరీర్ గైడెన్స్ పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల విద్యార్హతలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్హతను బట్టి ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లు, కంపెనీలు, సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. లొంగిపోయిన వారికి, వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖను సంప్రందించాలని సూచించారు. సమస్యలను సత్వరమే పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె. . దీరజ్, పాడేరు సీఐ దీనబంధు, స్పెషల్ బ్రాంచి సబ్ఇన్‌స్పెక్టర్ రుషీశ్వరరావు పాల్గొన్నారు.

### మందులషాపు యజమానులు నిబంధనలు పాటించాల్సిందే

రంపచోడవరం: ఏజెన్సీలో అన్ని మండలాల్లోని మెడికల్ షాపు యజమానులు నిబంధనల ప్రకారం పెయిన్ కిల్లర్లు, యాంటీబయోటిక్ మందులను రిజిష్టర్డు వైద్యుల సిఫార్సు మేరకు మాత్రమే విక్రయించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. వారు సిఫార్సు చేసిన మందుల చీటి లేకుండా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మెడికల్ షాపు యాజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# 31 నుంచి అరకు చలి ఉత్సవాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్, తదితరులు




చలి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- మూడు రోజులపాటు నిర్వహణ
- కలెక్టర్ దినేష్‌కుమార్
- పోస్టర్ ఆవిష్కరణ


అరకులోయ టౌన్: ఈనెల 31 నుంచి మూడు రోజులపాటు వైభవం అరకు చలి ఉత్సవాలు నిర్వహిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం పర్యాటక శాఖ పున్నమి హరిత రిసార్ట్స్ గోష్టి సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఈనెల 31, ఫిబ్రవరి 1,2 తేదీలో జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల్లో కూడా వివిధ కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామని ఆయన పేర్కొన్నారు. మొదటి రోజు పద్మాపురం ఉద్యానవనం నుంచి డిగ్రీ కళాశాలలోని ఉత్సవ వేదిక వరకు 5కేఎం మారథన్, మ్యూజిక్, సుందరమైన వస్త్రాలంకణలో కార్నివాల్‌తో ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. పద్మాపురం ఉద్యానవనంలోని ఫ్లవర్ షో ఏర్పాటు చేస్తామన్నారు. సుమారు 30 రకాల స్టాళ్లను ఏర్పాటుచేస్తామని వివరించారు. సాయంత్రం 4 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఏడు వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారులు పాల్గొంటారని ఆయన వివరించారు. రెండవ రోజు 20 కిలోమీటర్లు సైక్లింగ్ ఉంటుదన్నారు.

స్థానికంగా లభించే పువ్వులతో అరకు బొకే స్టాల్ ఏర్పాటు చేస్తున్నామని, అతిథులకు వీటితో స్వాగతం పలుకుతామన్నారు. రంగోలి, డ్రాయింగ్ పోటీలు, వివిధ రకాల టాలెంట్ షోలు నిర్వహిస్తామన్నారు. మూడవ రోజు వెస్ట్రన్ డ్యాన్స్, పాటలు, పర్యాటకులతో ఈకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధిస్తున్నామని చెప్పారు. ఇందుకు పంచాయతీరాజ్, పోలీస్, ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుంటామన్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు కేటాయించిందన్నారు. సీఎస్సార్ నిధులకోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జేసీ అభిషేక్‌గౌడ్, పీవో వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డీఎల్పీవో కుమార్, తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్, ఎంపీడీవో అడపా లవరాజు, సీఐ ఎల్. హిమగిరి, టీడబ్ల్యూ ఈఈ వేణుగోపాల్, టూరిజం ఇన్‌చార్జీలు దాసు, మురళి పాల్గొన్నారు.

# వణికిస్తున్న చలి.. దట్టంగా పొగమంచు



చింతపల్లిలో భారీగా కురుస్తున్న పొగమంచు



చలిమంట కాగుతున్న గిరిజనులు

- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- జీకేవీధిలో 4.1 డిగ్రీల నమోదు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఒకపక్క మంచు దట్టంగా కురుస్తోంది. మరోపక్క శీతల గాలుల తీవ్రతకు మన్యంవాసులు వణికిపోతున్నారు. గూడెంకొత్తవీధిలో శుక్రవారం 4.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అయినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధి జి.మాడుగులలో 4.5, చింతపల్లిలో 5.0,వా హుకుంపేటలో 5.7, పాడేరులో 5.8, అరకువేలిలో 6.9, పెదబయలులో 7.0, డుంబ్రిగుడలో 7.6 , ముంచంగిపుట్టులో 10.3, కొయ్యూరులో 10.5, అనంతగిరిలో 11.9 డిగ్రీలు నమోదు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. చింతపల్లి ప్రాంతంలో ఉదయం 10 గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. ఇలావుండగా చింతపల్లిలో గత ఏడాది జనవరి 7 వతేదీన 6.5 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ ఏడాది తొలిసారిగా ఈనెల 21న 5.5, 24న 5.0 డిగ్రీలు నమోదు అయ్యాయి.

# రోగుల పట్ల ప్రేమతో మెలగాలి

- అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి
- పాడేరు జిల్లా ఆస్పత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ ల్యాబ్ ప్రారంభం



క్యాన్సర్ స్క్రీనింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి




బాలింత, శిశువు ఆరోగ్య పరిస్థితిని పరీక్షిస్తున్న అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి

పాడేరు : ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది ప్రేమగా మెలగడమే కాకుండా వారికి స్నేహపూర్వక వాతావరణంలో వైద్యసేవలు అందించాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన క్యాన్సర్ స్క్రీనింగ్ ల్యాబ్‌ను శుక్రవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హిస్టోపాథాలజీ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. మాతా,శిశు విభాగం ఓపీతో పాటు వార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. అందుతున్న వైద్య సేవలు, ఆహారంపై వివరాలు తెలుసుకున్నారు.గతంలో డాక్టర్‌గా పనిచేసిన ఆమె పలువురు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ గత ప్రభుత్వ హయాంలో మంజూరైందన్నారు. క్యాన్సర్ రోగ నిర్ధారణకు ఇకనుంచి విశాఖపట్నం, ఇతర మైదాన ప్రాంత ఆస్పత్రులకు వెళ్లాల్సిన కష్టాలు జిల్లా ప్రజలకు తప్పాయన్నారు. క్యాన్సర్ పట్ల వైద్య సిబ్బంది గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింగరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, రూఢకోట సర్పంచ్ కాతరి సురేష్ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ దినేష్‌కుమార్
- మీకోసంలో 109 వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ, పీవో, సబ్ కలెక్టర్, డీఆర్వో తదితరులు

పాడేరు : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్వో పద్మాలత ప్రజలనుంచి 109 వినతులను స్వీకరించారు. ప్రధానంగా భూ సమస్యలు, రహదారుల నిర్మాణం, తాగునీటి సమస్యలు, విద్యుత్ సదుపాయం కల్పన, తదితర వాటిపై ప్రజలు అర్జీలు అందజేశారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలను నిశితంగా పరిశీలించి సకాలంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను సంబంధిత అర్జీదారుడికి తెలియజేయాలని సూచించారు. టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజనీ, డీఎల్‌పీవో పీఎస్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీసీహెచ్ డాక్టర్ కృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌బాబు, పీఆర్ ఈఈ కొండయ్యపడాల్ పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు

- చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్




మాట్లాడుతున్న పీవో అపూర్వభరత్

చింతూరు: ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక ఐటీడీఏ పీవో అపూర్వభరత్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బాలికలు మంచిగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో మెలుగుతూ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని ఆయన సూచించారు. ప్రణాళికతో చదివి త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఐటీడీఏ తరఫున ప్రత్యేక బహుమతి అందచేస్తామని పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, తహసీల్దార్ చిరంజీవి, సీడీపీవో విజయగౌరి, ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

# మొబైల్ మెడికల్ యూనిట్లు సద్వినియోగం

- కలెక్టర్ దినేష్‌కుమార్
- రెండు వాహనాలు ప్రారంభం



మొబైల్ మెడికల్ యూనిట్ల వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : గిరిజన గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందించేందుకు మొబైల్ మెడికల్ యూనిట్లను ఉపయోగించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ సీఎస్సార్ నిధులతో భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సమకూర్చిన రెండు మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను శుక్రవారం ఐటీడీఏ వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ రెండింటిని పాడేరు, అరకు నియోజకవర్గాలకు ఒకొక్కటి చొప్పున కేటాయించాలన్నారు. నెలలో 24 రోజులు కేటాయించిన రూట్ ప్లాన్ ప్రకారం గ్రామాలకు వెళ్లి గిరిజనులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఒక్కో మొబైల్ యూనిట్‌లో ఒక డాక్టర్‌తో పాటు ఒక ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, పైలెట్ అందుబాటులో ఉంటారని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, డీసీహెచ్ డాక్టర్ కృష్ణారావు, మైనింగ్ కార్పొరేషన్, భవ్య హెల్త్ సర్వీసెస్ మేనేజర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నీలగిరి చెట్లు నరికివేత?

- గుట్టుగా తరలిస్తున్నారని ప్రచారం

**అరకులోయ టౌన్:** మండలంలోని మారుమూల బస్కీ పంచాయతీ అటవీ ప్రాంతంలోని నీలగిరి చెట్లను కొంతమంది అక్రమార్కులు నరికి తరలించుకుపోతున్నారని బస్కీ పంచాయతీ వాసులు ఆరోపించారు. కొద్దిరోజులుగా రాత్రి వేళలో చెట్లను నరికి మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ వద్దకు చేర్చి అక్కడి నుంచి లారీల్లో మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీని వెనుక బస్కీ పంచాయతీకి చెందిన కొంతమంది కలప తరలింపు దారుల ప్రమేయం ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అరకులోయ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా బస్కీ పంచాయతీ గుగ్గుడు గ్రామ రైతులు నీలగిరి చెట్లు కటింగ్‌కు అనుమతి తీసుకున్నారన్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌లోని నీలగిరి చెట్లను నరికి తరలిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

### 220 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు

**పెదబయలు:** మండలంలోని లింగేటి పంచాయతీ లింగేరిపుట్టు జంక్షన్ వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న 220 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ కె.రమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లింగేరిపుట్టు జంక్షన్ వద్ద శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న లింగేటి పంచాయతీ చెందిన లింగేరి సుబ్బారావు, వంతాల సూరిబాబు, కొర్రా గణేష్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వారిచ్చిన సమాచారం మేరకు చీపురుగొంది గ్రామ సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. అంతేకాకుండా ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన వివరించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.11 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

**కొత్తవలసలో ప్రత్యేక హాల్ట్**



**తాటిచెట్లపాలెం(విశాఖ):** ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశాఖపట్నం, పరిసర ప్రాంతాల నుంచి వెళ్లే యాత్రికులు, ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. పెందుర్తి, కొత్తవలస ప్రాంత ప్రయాణికుల కోసం కుంభమేళా ప్రత్యేక రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–గోరఖ్‌పూర్(08562) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 16వ తేదీ రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 18వ తేదీ రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.48 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 10.50 గంటలకు బయలుదేరుతుంది. గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08561) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 19వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి 21వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ మధ్యాహ్నం 11.22 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 11.24 గంటలకు బయలుదేరుతుంది.
- విశాఖపట్నం – దీన్‌దయాల్ ఉపాధ్యాయ (08530) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 6, 20, 27వ తేదీల్లో(గురువారం) సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయలుదేరి ఫిబ్రవరి 8, 22, మార్చి 1(శనివారం)న తెల్లవారు 4.30 గంటలకు దీన్ దయాల్ ఉపాధ్యాయకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఆయా రోజుల్లో సాయంత్రం 6.05 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 6.07గంటలకు బయలుదేరుతుంది. దీన్ దయాల్ ఉపాధ్యాయ–విశాఖపట్నం (08529) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 8, 22, మార్చి 1(శనివారం)న రాత్రి 8.10 గంటలకు దీన్‌దయాల్ ఉపాధ్యాయలో బయలుదేరి, ఫిబ్రవరి 10, 24, మార్చి 3(సోమవారం) వ తేదీల్లో తెల్లవారుజాము 3.25 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ తెల్లవారుజాము 2.36 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 2.38 గంటలకు బయలుదేరుతుంది.

## విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న అధ్యాపకులు

**పాడేరు రూరల్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రసూల్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. మహిళా సాధికార కన్వీనర్ సుమిత్ర, అధ్యాపకులు రమేష్‌బాబు, గౌరిశంకర్ పాల్గొన్నారు.

## కొబ్బరి ఫ్యాన్సీ వస్తువుల తయారీ శిక్షణ తేదీల మార్పు

**రంపచోడవరం:** కొబ్బరి ఆధారిత ఫ్యాన్సీ వస్తువుల తయారీపై శిక్షణ తేదీల మార్పు చేసినట్టు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.సి.వెంగయ్య తెలిపారు. వచ్చేనెల 23 నుంచి 28 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న యువత పందిరిమామిడి హెచ్ఆర్ఎస్( ఫోన్ నంబర్లు 9493128932, 7382633663, 08864–243577 )లో సంప్రదించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**అడ్డతీగల:** మండలంలోని ఎల్లవరం వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఏలేశ్వరం మండలం మర్రివీడుకి చెందిన బైక్‌పై వెళుతున్న పి.వీరభద్రరావు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.మర్రివీడు నుంచి అడ్డతీగల వైపు వెళ్తున్న బైక్, ఏలేశ్వరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ప్రమాదంలో గాయపడిన వీరభద్రరావును ఎల్లవరం పీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం రిఫర్ చేశారు. అడ్డతీగల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన వీరభద్రరావు

## బాలికా సంరక్షణకు కృషి

- కలెక్టర్ దినేష్‌కుమార్

**సాక్షి,పాడేరు:** బాలికా సంరక్షణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక లగిశపల్లి కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాలికల హక్కుల పరిరక్షణకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో బాలికలు, మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. బాలికలంతా బాగా చదివితే సమాజంతో పాటు వారి కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు.బాలికలంతా జెంటిల్ ఉమెన్‌గా ఎదగాలన్నారు. బాలురతో సమానంగా బాలికలకు సమాజంలో సమాన హక్కులు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులంతా బాలురు,బాలికలనే వ్యత్యాసం చూపకుండా బాలికలను కూడా బాగా చదివించాలన్నారు. బాలికలంతా సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని,ఉన్నత చదువుల లక్ష్యాన్ని నిర్మించుకోవాలన్నారు. డీఈవో పి.బ్రహ్మాజీరావు,ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి,ఎంపీపీ రత్నకుమారి, సీడీపీవో ఝాన్సీరాణి, లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, కేజీబీవీ ఎస్‌వో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయాలకు అతీతంగా నిలదీయాలి

**సీలేరు:** గూడెం కొత్తవీధిలో ఈ నెల 25న జరగనున్న మండల పరిషత్ సమావేశంలో అధికారులను మండల ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారంపై రాజకీయాలకు అతీతంగా నిలదీయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాసు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఆర్‌వీ నగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారికి ఎందుకు మరమ్మతులు చేపట్టడం లేదని ప్రశ్నించాలని ఆయన కోరారు.

### రక్తదాన శిబిరానికి విశేష స్పందన



ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరం

**చింతపల్లి:** స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభావతి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన శిబిరంలో 40 మంది దాతలు పాల్గొన్నారు. చింతపల్లి, జీకేవీధి ఎస్ఐలు వెంకటేశ్వరరావు, అప్పలసూరి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యానవన రైతులను గుర్తించండి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

**చింతపల్లి:** గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఉద్యాన వన రైతులను కూడా గుర్తించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడుగుంతలు ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

**అరకులోయటౌన్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి, అక్రమ నిర్మాణం చేపడుతున్న గిరిజనేతరుడిపై ఎల్‌టీఆర్ కేసుతోపాటు, పోలీస్ కేసు నమోదు చేయాలని పెదలబుడు ఎంపీటీసీ దురియా ఆనంద్ కుమార్, నరసింహమూర్తి తహసీల్దార్ ఎం.వి.వి. ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. పెదలబుడు ఈవోగా రాజ్‌కుమార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అరకులోయ పట్టణంలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయని, ఈవోపై చర్యతీసుకోవాలని కోరుతూ ఆనంద్‌కుమార్, నర్సింహమూర్తి ఎంపీడీవో అడపా లవరాజుకు ఫిర్యాదు చేశారు.

### రాజమహేంద్రవరం, విజయనగరానికి ఆర్టీసీ సర్వీసులు



పాడేరు-రాజమహేంద్రవరం బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర

**పాడేరు :** పాడేరు ఆర్టీసీ డిపో నుంచి రాజమండ్రి, విజయనగరం ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం అయ్యాయి. పాడేరు ఆర్టీసీ డిపోకు ఇటీవల రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చాయి. వీటిని ఆయా రూట్లకు కేటాయించారు. పాడేరు ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజు ఉదయం 10.30గంటలకు విజయనగరం బస్సు సర్వీసు ఉంటుంది. ప్రతిరోజు మధ్యాహ్నం 12.30గంటలకు పాడేరు నుంచి అనకాపల్లి మీదుగా రాజమహేంద్రవరానికి బస్సు సర్వీసు ఉంటుందని అధికారవర్గాలు తెలిపాయి. వీటిని శుక్రవారం స్థానిక డిపో వద్ద ఆర్టీసీ విజయనగరం రీజియన్ చైర్మన్ దొన్నుదొర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు, డిప్యూటీ సీఎంఈ రాజశేఖర్, డీపీటీవో ఉమామహేశ్వరరెడ్డి, ఎంఎఫ్ శ్యామ్ సుందర్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి పాల్గొన్నారు.

### వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే



ఆశా వర్కర్లకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పీవో సింహాచలం

**రంపచోడవరం:** గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఐటీడీఏ సమావేశం హాలులో శుక్రవారం ఆశా కార్యకర్తలకు క్షేత్రస్థాయి ఆరోగ్య సేవల పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు మండలాల్లో 19 పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని, జ్వర పీడితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఏడు మండలాల్లో 605 మంది ఆశా కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి. శిరీష, ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ, ఈఈ ఐ. శ్రీనివాసరావు, డీపీఎం అపర్ణ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి పీసా కమిటీ సభ్యులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రేమ్ సాగర్

**అరకులోయటౌన్:** క్లస్టర్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి పీసా కమిటీ సభ్యులు కృషి చేయాలని డుంబ్రిగుడ ఎంపీడీవో ప్రేమ్ సాగర్ తెలిపారు. మండలంలోని పద్మాపురం నేచర్ క్యాంపస్‌లో శుక్రవారం డుంబ్రిగుడ మండలంలోని పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే నిధులను క్లస్టర్ అభివృద్ధికి వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డుంబ్రిగుడ మండలంలోని కురిడి, కొల్లాపుట్, సాగర, సొవ్వా, కండ్రూం పంచాయతీల నుంచి 101 మంది పీసా కమిటీల ప్రతినిధులు, నేచర్ సిబ్బంది తడబారికి సంతోష్ కుమార్, రవి, అద్దు, రాంబాబు, ఎల్‌బి. పద్మ, నగేష్, ప్రసాద్, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

### రామమందిరం ప్రారంభం



పూజ చేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు

**చింతూరు:** సీఆర్పీఎఫ్ బి–42, బి–141, జి–141 బెటాలియన్ల ఆధ్వర్యంలో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన అల్లిగూడెం క్యాంపు వద్ద శుక్రవారం నూతనంగా నిర్మించిన సీతారామ మందిరాన్ని బి–141 బెటాలియన్ కమాండెంట్ రితేష్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, విద్యార్థులకు అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం గుడి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అధికారులు కమలేష్‌యాదవ్, ప్రీతి, హేమంత్‌కుమార్, చేతన్ పాల్గొన్నారు.

## కలెక్టర్ సహకారం.. గ్రామస్తుల శ్రమదానం



పాఠశాల ప్రారంభ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీసాయిహర్ష, ఎంఈవోలు, నేతలు



వందనపల్లిలో కలెక్టర్ చొరవతో నిర్మించిన పాఠశాల భవనం

- వందనపల్లిలో పాఠశాల భవన నిర్మాణం
- వసతి సమస్య శాశ్వత పరిష్కారం

**ముంచంగిపుట్టు:** కలెక్టర్ దినేష్‌కుమార్ అందించిన సహకారానికి గ్రామస్తులు శ్రమదానం జోడించి పాఠశాలకు భవనం నిర్మించారు. వసతి సమస్య పరిష్కరించి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని వందనపల్లిలో పాఠశాలలో 27 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. పక్కా భవనం లేక వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సర్పంచ్ రత్న, ఎంపీటీసీ కొండమ్మ పాడేరు వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. వసతి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కలెక్టర్ రూ.2 లక్షల మేర ప్రత్యేక నిధులను మంజూరు చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల భవన నిర్మాణానికి ఉపక్రమించారు. మంజూరైన రూ.2 లక్షలతో భవన నిర్మాణానికి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. శ్రమదానం జోడించి నిర్మాణం పూర్తి చేశారు. శుక్రవారం ఈ భవనాన్ని ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష, ఎంఈవోలు కృష్ణమూర్తి,రత్నకుమార్, సర్పంచ్ రత్న, ఎంపీటీసీ కొండమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు మూర్తి, కొండలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నూకరాజు,సీఆర్పీ సురేష్, డీడీవో సింహాచలం పాల్గొన్నారు.

## జనరేటర్లకు వెంటనే మరమ్మతులు

**ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) సజయ్‌కుమార్ ఆదేశం**



అవుట్‌సోర్సింగ్ నియామకాలపై సజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

**ముంచంగిపుట్టు:** సాంకేతిక లోపాలకు గురైన జనరేటర్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) సజయ్‌కుమార్ ఆదేశించారు. ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తిపై ఆరా తీశారు. ప్రస్తుతం 57 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని అధికారులు వివరించారు. మరమ్మతులకు గురైన 3,4,5 నంబర్ల జనరేటర్లను ఆయన పరిశీలించారు.శరవేగంగా మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టులో అధికారులు, సిబ్బందితో సమావేశం అయ్యారు. విద్యుత్‌కేంద్రంలో సమస్యలు తెలుసుకున్నారు. 2023–24లో మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఏపీ జెన్‌కో యాజమాన్యం ప్రకటించిందని, దీనిని గణతంత్ర వేడుకల్లో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా అందజేస్తారని ఆయన తెలిపారు.

**అవుట్ సోర్సింగ్ నియామకాలపై ఫిర్యాదు**

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఏపీ జెన్‌కో డైరెక్టర్(హైడల్) సజయ్‌కుమార్‌కు ఒనకఢిల్లీ పంచాయతీ వాసులు ఫిర్యాదు చేశారు. విద్యుత్ కేంద్రంలో 17మంది ఒప్పంద కార్మికులుగా నియమించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. వీటిని ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకే కట్టబెడుతున్నారని, అసలైన నిరుద్యోగులకు అవకాశం ఇవ్వకుండా భారీగా ముడుపులతో నియామకాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. అవుట్ సోర్సింగ్ నియామకాలు సక్రమంగా జరపాలని వారు కోరారు.

## 'కూటమి' మోసపూరిత హామీలకు వ్యతిరేకంగా పోరాటం

**ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర**



మహాసభలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర

**పాడేరు రూరల్:** కూటమి నేతలు బోగస్ హామీలను ఇచ్చి అధికారంలో వచ్చారని, కూటమి ప్రభుత్వ మోసపూరిత చర్యలకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా ప్రథమ మహాసభను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజేంద్ర మహాసభను ప్రారంభించి, జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు అందరూ ఏకమై ఉద్యమించాలన్నారు.

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గం**

ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా లక్ష్మణ్, మరో 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శులు రాము,లక్ష్మణ్‌లు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారయణ, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు అమర్,రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సీపీఐ నాయకులు చంటి,కృష్ణ,తనీష్ తదితరులు పాల్గొన్నారు.

## తాటాకు ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

**కూనవరం:** మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకు ఇల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన బల్లెం రమణయ్య తాటాకు ఇల్లు దగ్ధమైనట్టు గ్రామస్తులు తెలిపారు. సుమారు రూ. 3లక్షల ఆస్తినష్టం జరిగినట్టు వారు చెప్పారు. బాధితుని కుటుంబానికి 25 కిలోల బియ్యం, కంది పప్పు, మంచినూనె తదితర నిత్యావసర వస్తువులు అందించినట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జల్లి సత్యనారాయణ తెలిపారు.